క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం



దాత లక్ష్మీతేజకు విరాళం బాండ్ అందిస్తున్న ఆలయ ఏఈఓ లక్ష్మణస్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కైకలూరు మండలం భుజబలపట్నంకు చెందిన కొత్తపల్లి నాగదార లక్ష్మీతేజ శనివారం రూ.1,01,116 లను విరాళంగా అందజేశారు. తొలుత స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కార్యాలయంలో విరాళం సొమ్ము జమచేశారు. దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి విరాళం బాండ్ పత్రం అందజేశారు.

కుక్కునూరులో మేరా మిట్టీ - మేరా దేశ్



కలశాలలోకి మట్టి సేకరిస్తున్న దృశ్యం

కుక్కునూరు: మేరా మిట్టీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం కుక్కునూరు రామసింగారం ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థుల నుంచి మట్టిని కలశాల్లోకి సేకరించారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా కేంద్ర యువజన శాఖ, నెహ్రూ యువకేంద్ర, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ పెంకె సాగర్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి సేకరించిన మట్టిని ఏలూరు పంపనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.రామకృష్ణ, ఉపాధ్యాయులు పి.రామకృష్ణ, డి.సంతోష్, ఎస్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ భవనం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సాబ్జి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో యూటీఎఫ్ భవన పునఃప్రారంభోత్సం శనివారం నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొని భవనాన్ని ప్రారంభించగా, యుటీఎఫ్ గ్రంథాలయాన్ని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ప్రారంభించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ అభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. భవన అభివృద్ధికి కృషి చేసిన జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవీ శ్యాంబాబు సేవలను కొనియాడారు. ఎక్కువ మొత్తంలో విరాళం అందజేసిన షేక్ షరీఫ్‌ను సన్మానించారు. ఇటీవల మృతిచెందిన బాసిన ఆర్‌బీబీఎస్ లక్ష్మి, ఆర్‌డీ ప్రసాద్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవికుమార్, కనకదుర్గ, బత్తుల అనూరాధ, వీరకోటి, రంగమోహన్, పీవీ నరసింహారావు, వివిధ మండల అధ్యక్ష కార్యదర్శులు జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజనుల మధ్య వివాదం

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెం - మర్లగూడెం గ్రామాల మధ్య తూర్పువైపు అటవీప్రాంతంలో గిరిజనులు శనివారం అడవిని నరికేశారు. కొమ్ముగూడెం గ్రామ శివారులో అటవీప్రాంతంలో గ్రామానికి చెందిన కొందరు గిరిజనులు అడవిని నరకగా, అది తమ పరిధి అంటూ మర్లగూడెంకు చెందిన గిరిజనులు పోటాపోటీగా అడవిలో చెట్లను నరికే ప్రయత్నంలో రెండు వర్గాల మధ్య భారీగా ఘర్షణ జరిగినట్లు తెలిసింది. చెట్ల నరికివేతపై ఫారెస్ట్ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం జంగారెడ్డిగూడెం, కన్నాపురం, కుక్కునూరు రేంజ్ పరిధిలోని ఫారెస్ట్ అధికారులు చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలించనున్నట్టు తెలిసింది.

గడపగడపలోనూ ఆత్మీయత

- అర్హులందరికీ పథకాలు
- ఎమ్మెల్యే బాలరాజు



కామవరంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలరాజు



అంతర్వేదిగూడెంలో సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడంతో గడపగడపకు కార్యక్రమంలో ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభిస్తోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం కామవరం, మోతుగూడెం గ్రామాల్లో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఆ సమయంలో ప్రతి ఒక్కరూ చిరునవ్వులతో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వలంటీర్‌ల ద్వారా నేరుగా వచ్చి అందుతున్నాయని ప్రజలు వెల్లడించారని బాలరాజు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయనివిధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారని ఆయన చెప్పారు. నవరత్న పథకాల్లో అర్హులందరికీ పింఛన్లు, జగనన్న తోడు, జగనన్న కాలనీలు, అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన వంటి అనేక పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని వివరించారు.

పథకాలపై అలసత్వం వద్దు

బుట్టాయగూడెం: సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించే విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హెచ్చరించారు. మండలంలోని అంతర్వేదిగూడెంలో నిర్మించిన రైతు భరోసాకేంద్రం, గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అంతర్వేదిగూడెం సచివాలయ పరిధిలో సుమారు రూ.16 కోట్ల వరకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ప్రజలకు అందిస్తుంటే ఆ పథకాలు వివరించే అవకాశం ఉన్నప్పటికీ ప్రజలు ప్రభుత్వ కార్యక్రమాలకు తీసుకురాకపోవడం బాధాకరమని బాలరాజు అన్నారు. ఈ నెల 30న జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ విజయానికి కృషి చేయాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ మారుమూల గ్రామాలకు సైతం పథకాలు అందేలా కృషి చేస్తున్నారని అన్నారు. జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై వెంకన్న పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు జోడే సత్యదుర్గాప్రసాద్, కె.గంగరాజు, ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, దుర్గారావు, గిరిజన సంక్షేమ శాఖ డీఈ ఎస్ జోనాథన్, తహసీల్దార్ శాంతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీ కృష్ణ, ఈఓపీఆర్‌డీ శ్రీహరి, ఏఓ బి.సుమలత తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పట్టిసీమలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్: లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ సొమ్ము వలంటీర్ల ద్వారా అందజేస్తున్నట్టు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం పాత పట్టిసీమ సచివాలయం వద్ద శనివారం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎంపీపీ వెంకటరెడ్డి అందజేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందర్హులందరికీ పింఛన్ మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బారపు శ్రీరామమూర్తి, పంచాయతీ కార్యదర్శి విజయదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



బయ్యనగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండలంలోని బయ్యనగూడెం పీహెచ్‌సీ పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. డాక్టర్ విజయకృష్ణ, ఆరోగ్య విస్తరణ శాఖ అధికారి ఎల్.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. అనారోగ్య సమస్యలున్న వారికి ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేస్తారని, అవసరమైతే మెరుగైన వైద్య చికిత్సకు సిఫార్సు చేస్తారని డాక్టర్ విజయకృష్ణ తెలిపారు.

చవితి వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు



తిమ్మాపురం రహదారిపై ఏర్పాటుచేసిన స్వాగత ద్వారం



ద్వారకాతిరుమల సొసైటీ పెట్రోల్ బంకు వద్ద ముస్తాబైన మందిరం

ద్వారకాతిరుమల: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు మండలంలో శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మందిరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 18న వినాయక చవితిని పురస్కరించుకుని గణనాథుల భారీ విగ్రహాలను ఆయా మందిరాల్లో ప్రతిష్ఠించనున్నారు. ద్వారకాతిరుమలలోని చెరువు వీధి, సొసైటీ పెట్రోల్ బంకు వద్ద, గుడి సెంటర్, శ్రీవారి దేవస్థానం పాఠశాల వద్ద, ఆర్చి గేటు సెంటర్, వసంత్ నగర్ కాలనీ, ఆశ్రం వద్ద ఇలా దాదాపు 12 ప్రాంతాల్లో ఉత్సవాల నిర్వహణకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. తిమ్మాపురంలో రహదారికి ఇరువైపులా విద్యుద్దీపాలకరణలు చేస్తున్నారు. స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీల సభ్యులు చెబుతున్నారు.

వినాయక పందిళ్లకు అనుమతి తప్పనిసరి



సీఐ మల్లేశ్వరరావు

చింతలపూడి: వినాయక పందిళ్ల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని సీఐ ఎంవీఎస్ మల్లేశ్వర్రావు అన్నారు. ఎస్పీ మేరి ప్రశాంతి, డీఎస్పీ ధనుంజయుడు ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కె.ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఉత్సవ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. పందిళ్ల వద్ద విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరక్కుండా విద్యుత్ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైక్ సెట్లు వినియోగించాలని, అధిక సౌండ్ పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు. పందిళ్ల వద్ద అసాంఘిక కార్యకలాపాలు, మద్యం విక్రయాలు, మద్యం సేవించడం వంటివి నేరమన్నారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

అసౌకర్యం కలుగకుండా చూడాలి



సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మండపాల ప్రతినిధులు సుహృద్భావ వాతావరణంలో, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వేడుకలు జరుపుకోవాలని సీఐ పి.రాజేష్ సూచించారు. ఉత్సవ కమిటీ వారు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధాన రోడ్లు, వివాదాస్పద స్థలలు, మతాలయాల ప్రాంగణాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించొద్దని సూచించారు. మండపాల ఏర్పాటు, మైక్‌లకు అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని, చందాల పేరుతో ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు. ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి, సిబ్బంది, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాలలో వినాయక చవితి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో పూజలు



వెంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరిలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. సుప్రభాత సేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదాగోష్ఠి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా, ఏజెన్సీ, పట్టణ, నలుమూలల నుంచి కాలినడకన వచ్చి అష్టోత్తర పూజలు చేసి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. భక్తులకు ముప్పన నరేష్ రెడ్డి కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు పూజలు చేయగా, అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్, రాజనపండు, వాసవిశాయి నగేష్, మాజీ చైర్మన్ ఉప్పలగంగాదర్, ఆలయ కార్యనిర్వహణాధికారి మానికలరాంబాబు పాల్గొన్నారు.

పోషకాహార మహోత్సవాలు



కన్నాపురంలో పోషకాహార మహోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రేపటి పౌరులను సంపూర్ణ ఆరోగ్యంతో తీర్చిదిద్దగలిగిన తల్లులు భావిభారతానికి దిక్సూచిగా నిలుస్తారని సర్పంచ్ ఉప్పల పద్మావతి పేర్కొన్నారు. శనివారం కన్నాపురం గ్రామంలో పోషకాహార మహోత్సవాలు కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నయోమీరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. పోషణ అభియాన్ సింబల్ ద్వారా ఐసీడీఎస్ కల్పిస్తున్న పౌష్టికాహార వసతులు, సదుపాయాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంపీటీసీ ఎస్‌కే బాజీతో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ పద్మావతి పోషకాహార విలువలు గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేకమైన వంటకాలను వండి గర్భిణులు, బాలింతలకు వడ్డించారు. అనంతరం సీమంతాల కార్యక్రమం గర్భిణులు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు శేషుబాబు



శ్రీవారి ఆలయంలో శేషుబాబు దంపతులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని టీటీడీ పాలకమండలి సభ్యుడు మేకా శేషుబాబు శనివారం సాయంత్రం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనం పలికారు. ఆ తరువాత స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

మద్ది అంజన్న సేవలో..

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామిని శనివారం టీటీడీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం శేషుబాబుకి వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది శేషుబాబుకి శేషవస్త్రాన్ని కప్పి సత్కరించి, స్వామి వారి ప్రసాదాన్ని, చిత్రపటం అందజేశారు.

చెరువులో యువకుడి గల్లంతు

చింతలపూడి: మండలంలోని డీఎస్‌రావుపేట సమీపంలోని వెంకటాద్రి చెరువులో ఒక యువకుడు గల్లంతైన ఘటన శనివారం చోటు చేసుకుంది. రాఘవాపురం గ్రామానికి చెందిన రాములు రాంబాబు(18) పిట్టలు పట్టుకుని జీవిస్తుంటాడు. బహిర్భూమికని వెంకటాద్రి చెరువుకెళ్లి ప్రమాద వశాత్తూ పడి గల్లంతయ్యాడు. గ్రామస్తులిచ్చిన సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని యువకుని కోసం గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై కె.ప్రసాద్ తెలిపారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

ఏలూరు రూరల్ : జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం అందిస్తోన్న సహకారాన్ని ప్రతి ఒక్కరూ అందుకోవాలని పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఏలూరులో పలువురు దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించారు. దివ్యాంగుల కోసం కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీస్‌థెరిపీ, డీఓడీ తదితర సేవలు అందిస్తున్నామని శ్రీనివాస రెడ్డి చెప్పారు.

అన్నమాచార్య అష్టోత్తర శత సభాగాన సంకీర్తనలు



వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వేదికపై సంకీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

ద్వారకాతిరుమల: ప్రతి ఒక్కరూ భక్తి భావంతో హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని శ్రీ అన్నమాచార్య సంకీర్తన స్వర వాహిని చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ గాయకుడు కోటపాటి వేంకటేశ్వర్లు అన్నారు. క్షేత్రంలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్ వేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీ అన్నమాచార్య సంకీర్తన స్వర వాహిని చారిటబుల్ ఫౌండేషన్ వారిచే, అన్నమాచార్య సంకీర్తనలతో అష్టోత్తర శత సభాగాన సంకీర్తన మహాయజ్ఞం శనివారం ఉదయం నిర్వహించారు. 108 వైష్ణవ ఆలయాల్లో, 108 సభా వేదికలపై, 108 శనివారాల పాటు ఈ సంకీర్తనలు చేయాలనే తలంపుతో క్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేంకటేశ్వర్లు, వారి శిష్య బృందం భక్తి సంగీత పాటలతో గానకచేరి చేశారు. కార్యక్రమ ముగింపులో ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజులు వేంకటేశ్వర్లు, తదితరులను ఘనంగా సత్కరించారు.

నేటితో ముగియనున్న కుట్టు శిక్షణ




బయ్యనగూడెంలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

కొయ్యలగూడెం: తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ఆదివారంతో ముగియనుందని కోఆర్డినేటర్ ఆరేటి ఏసు బాబు పేర్కొన్నారు. తపన ఫౌండేషన్ చైర్మన్ సీతారామాంజనేయ చౌదరి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో సుమారు 70 మంది మహిళలు మూడు నెలలుగా శిక్షణ తీసుకున్నట్టు ట్రైనర్ ఎస్కె గౌసియా బేగం తెలిపారు. రెడీమేడ్ వస్త్ర ప్రపంచానికి ధీటుగా తయారు చేసుకునే వస్త్రాలను మహిళలు నేర్చుకొన్నట్టు చెప్పారు. ముగింపు కార్యక్రమంలో ఇప్పటి వరకు నేర్చుకున్న వివిధ వస్త్రాలు, అల్లికలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఆర్థికంగా తామంతా నిలదొక్కుకోవడానికి శిక్షణ దోహదపడుతుందని మహిళలు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తోడ్పడుతోపాటు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మద్దు బాలనాగేశ్వరరావు సహాయ సహకారాలు అందించారన్నారు.

పశువుల రవాణాపై కేసు

జంగారెడ్డిగూడెం: పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద తనిఖీలు చేస్తుండగా ఏలూరు వైపు వెళుతున్న గూడ్స్ లారీలో అనుమతులు లేకుండా 9 ఎద్దులు, 41 దున్నపోతులను రవాణా చేస్తున్నట్టు గుర్తించామన్నారు. డ్రైవర్‌ను విచారించగా లారీ ఓనర్ ఆర్.రామస్వామి చెప్పిన మేరకు, వి.గోపాలకృష్ణ సహకారంతో పశువులను లారీలోకి ఎక్కించుకుని తమిళనాడులోని కె.చిన్నదురైకు చెందిన కబేళాకు తరలిస్తున్నట్లు చెప్పాడన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.









వినాయక ప్రతిమల పంపిణీ



జంగారెడ్డిగూడెంలో వినాయక ప్రతిమల పంపిణీ

జంగారెడ్డిగూడెం: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ అనే అంశంలో భాగంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తొమ్మిది సంవత్సరాలుగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్నట్టు పరిషత్ సభ్యుడు కేవీఆర్ సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది గోమయం (ఆవుపేడ), మట్టి తయారీ ప్రతిమలు పట్టణంలోని కొత్తపేట, డాంగేనగర్, వైఎస్సార్ నగర్‌లలో పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. నవభారత్ ఫ్యాక్టరీ పీఆర్ఓ రాఘవరావు, సాలన సురేష్, వాసా రామకృష్ణ, వేమూరి శ్రీనివాస్ సహకారంతో ఈ వితరణ నిర్వహించామని తెలిపారు. పరిషత్ సభ్యులు బీకే విశ్వనాధ్, రాజేష్, మధు పాల్గొన్నారు.

● సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మట్టి, ఆవు పేడతో చేసిన వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ బాబు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంకు చెందిన సీహెచ్ శ్రీకాంత్ గో ఆధారితమైన గోశాల నిర్వాహకుల సహకారంతో ఈ ప్రతిమలు తయారు చేశామన్నారు.

● స్థానిక ప్రతిభ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో పర్యావరణహిత గణేష్ ప్రతిమల పోటీ శనివారం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ సరోజారెడ్డి తెలిపారు. 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు అందజేశామన్నారు. అకడమిక్ డైరెక్టర్ సింధూషారెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

● **జంగారెడ్డిగూడెం రూరల్:** మండలంలోని తాడువాయి ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో మట్టితో తయారు చేసిన గణనాథుని ప్రతిమలను సిబ్బందికి, స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు.

పీవోపీ వద్దు.. మట్టి విగ్రహాలే ముద్దు

కొయ్యలగూడెం: మట్టి విగ్రహాలే ముద్దు, పీవోపీ వాడకం వద్దు అంటూ నినదిస్తూ ఎంవీఆర్ స్కూల్ విద్యార్థులు శనివారం స్థానిక జాతీయ ప్రధాన రహదారిపైనా, సరిపల్లి రోడ్డులలో ర్యాలీ నిర్వహించారు. మట్టితో తయారుచేసిన రెండు వేల గణనాథుల ప్రతిమలను ప్రజలకు ప్రిన్సిపాల్ రవి మహేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మంగపతిదేవిపేటలో మాజీ సర్పంచ్ తేలే శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత దివంగత పోతన శేషగిరిరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గణేష్ సమకూర్చిన 200 విగ్రహాలను ప్రజలకు పంచారు.

మట్టి విగ్రహాల పంపిణీ

బుట్టాయగూడెం: వినాయక చవితి సందర్భంగా స్థానిక విద్యారోహిణీ డిజిటల్ స్కూల్‌లో శనివారం విఘ్నేశ్వరుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సుమారు 100 విగ్రహాలను పంపిణీ చేసినట్టు ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ తెలిపారు.